క్లుప్తంగా

నేడు వారసంతల వేలం

కెరమెరి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు వారసంత వేలం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అంజద్‌పాషా ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఎలాంటి బకాయిలు ఉండకూడదన్నారు. కెరమెరి గ్రామ పంచాయతీ ఏజెన్సీకి చెందిన నేపథ్యంలో వేలంలో కేవలం గిరిజనులు మాత్రమే పాల్గొనాలని పేర్కొన్నారు. వేలం అనంతరం కాంట్రాక్టు పొందిన వారు వేలం మొత్తంలో సగం రుసుము చెల్లించాలని, మిగిలినవి వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఎల్కపల్లిలో..

పెంచికల్‌పేట్: ఎల్కపల్లి వారసంత వేలాన్ని గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 12గంటలకు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కుకిడే చంద్రశేఖర్ ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పంచాయతీ కార్యాలయంలో డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

కుక్కల దాడిలో చుక్కలదుప్పి మృతి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని వంజీరి గ్రామంలోకి వచ్చిన చుక్కల దుప్పిపై ఆదివారం కుక్కలు దాడి చేయడంతో మృతి చెందింది. అటవీ ప్రాంతం నుంచి గ్రామంలోకి వచ్చిన దుప్పిపై కుక్కలు దాడిచేయగా, గాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. చికిత్స కోసం దుప్పిని అటవీశాఖ అధికారులు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందిందని అటవీశాఖ అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బెజ్జూర్: మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామానికి చెందిన సత్యబాయి(52)కి గత నాలుగు రోజుల క్రితం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద మండల కేంద్రానికి చెందిన గోరంట్ల రమేశ్ అనే వ్యక్తి ఆటో ఢీకొట్టింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను వరంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: కారు, బైక్ ఢీ కొని ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిలాటిగూడ గ్రామానికి చెందిన జస్వాల్ కిశోర్, భార్య సుకన్యతో కలిసి మధ్యాహ్నం పని నిమిత్తం ఆసిఫాబాద్ వెళ్లారు. తిరిగి బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో బూర్గుడ సమీపంలో బీఈడీ కళాశాల వద్ద యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో కారు బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు.

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



దర్శించుకుంటున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

బెజ్జూర్: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా వెంకటాపూర్ గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీ తోగు వేంకటేశ్వరస్వామిని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రావు, ఎంపీపీలు కొండ్ర మనోహర్ గౌడ్, కొప్పుల శంకర్, నాయకులు సామల తిరుపతి, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి



అమ్మ వారిని దర్శించుకుంటున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మండలంలోని భక్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడిబియ్యం, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కులో భాగంగా పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించారు. కోరుకున్న కోరికలు తీరాలని అమ్మవారికి ముడుపులు కట్టారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ భక్తులకు అన్న వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

మున్సిపాలిటీకి మార్కెట్ కరువు

- రోడ్ల పక్కన కూరగాయల విక్రయాలు
- తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలు
- మార్కెట్ స్థలాన్ని చూపించాలని స్థానికుల డిమాండ్
- ఆదాయం కోల్పోతున్న మున్సిపాలిటీ



జిల్లా కేంద్రంలో రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఆవిర్భవించి ఏడాది పూర్తవుతున్నా ఇప్పటి వరకు శాశ్వత మార్కెట్ ఏర్పాటు చేయలేదు. దీంతో పట్టణవాసులు కూరగాయలు కొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు చిరు వ్యాపారులు రోడ్లకు ఇరువైపులా కూరగాయలు విక్రయిస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఆసిఫాబాద్ గ్రామపంచాయతీగా ఉన్నంతకాలం జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్ సమీపంలో కూరగాయల మార్కెట్ నిర్వహించేవారు. పశువుల వారసంతను ప్రస్తుత జుబ్లీ మార్కెట్‌వైపు ఏర్పాటు చేశారు. అనంతర కాలంలో జుబ్లీ మార్కెట్ నిర్మాణం పూర్తి కావడంతో పాత కూరగాయల మార్కెట్‌ను అక్కడికి తరలించారు. అనంతరం ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఆవిర్భవించి, జుబ్లీ మార్కెట్ రాజంపేటకు కేటాయించడంతో ప్రస్తుత మున్సిపాలిటీకి మార్కెట్ లేకుండా పోయింది

తప్పని తిప్పలు..

పట్టణం మధ్యలో కూరగాయల మార్కెట్ ఉండడంతో ప్రజలు ఖాళీ సమయాల్లో కూరగాయలు కొనుక్కొని తీసుకు వెళ్లేవారు. జిల్లా కేంద్రంగా మారడంతో పట్టణ పరిధి పెరగడం, దీనికి తోడు జనాభా కూడా పెరగడంతో కూరగాయల మార్కెట్ జుబ్లీమార్కెట్‌కు తరలివెళ్లడంతో పాత కలెక్టరేట్, అంకుసాపూర్ వైపు ఉన్న ప్రజలు కూరగాయల కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నారు.

ఆదాయానికి గండి..

ప్రస్తుతం జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న జుబ్లీ మార్కెట్‌తోపాటు వారసంత కూడా రాజంపేట గ్రామపంచాయతీకి వెళ్లడంతో కూరగాయల మార్కెట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని మున్సిపాలిటీ కోల్పోవాల్సి వస్తుంది. జుబ్లీ మార్కెట్‌కు వచ్చేవారు మున్సిపాలిటీకి చెందిన వారు కావడంతో మున్సిపాలిటీలో మార్కెట్ లేకపోవడంతో ఆదాయం రాజంపేట గ్రామపంచాయతీకి వెళ్తుంది. పాత మార్కెట్ స్థానంలో కానీ వ్యవసాయ మార్కెట్ స్థలంలో కానీ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉండడంతో పాటు ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంది.

మార్కెట్ ఏర్పాటు చేయాలి



మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు కోసం అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుత జుబ్లీ మార్కెట్ సందీప్‌నగర్, బ్రాహ్మణవాడ, జన్కాపూర్, బనార్‌వాడీ, కసాబ్‌వాడీ, ప్రాంత ప్రజలకు దూరంగా ఉంది. పట్టణం మధ్యలో మార్కెట్ ఏర్పాటు చేస్తే అందరికి అందుబాటులో ఉంటుంది. మున్సిపాలిటీలో రోడ్లకు ఇరువైపులా విక్రయించడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

– ఆత్మకూరి చిరంజీవి, స్థానికుడు

పంట నష్టంపై సర్వే చేపట్టాలి



పంట పరిశీలిస్తున్న పెందోర్ మోతిరాం

కెరమెరి: ఇటీవల మండలంలోని అనేక గ్రామాల్లో కురిసిన వడగండ్ల వర్షంతో నష్టపోయిన పంటలపై సర్వే చేపట్టాలని మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం అన్నారు. ఆదివారం సాకడ, పెద్దసాకడ గ్రామాల సమీపంలో ఉన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 1000 ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న, నువ్వులు, గోధుమ తదితర పంటలు రైతులు పండిస్తున్నారని, శనివారం కురిసిన వడగండ్ల వానతో సగానికి పైగా పంటలు దెబ్బతిన్నాయని, అధికారులు స్పందించి పంట నష్టంపై సర్వే నిర్వహించే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

‘ఉపాధి’ పనుల పరిశీలన



బోరిలాల్‌గూడలో పనులు పరిశీలిస్తున్న ఏపీవో

కెరమెరి: మండలంలోని కెరమెరి, బోరిలాల్‌గూడ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఆదివారం ఈజీఎస్ ఏపీవో మల్లయ్య పరిశీలించారు. కూలీలు పనులు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఎండల నేపథ్యంలో ఉదయం, సాయంకాలం పనులు చేయాలని కూలీలకు సూచించారు. కొలతల ప్రకారం లోతు, వెడల్పు తవ్వాలని పేర్కొన్నారు. ఆర్థికంగా ఎదుగుదలకు పని చేస్తున్న ప్రతికూలీ కనీసం రోజుకు రూ.300 సంపాదించాలని, జాబ్‌కార్డు కలిగి పనిచేయకుండా ఇళ్లల్లో ఉండే కూలీలకు కూడా అవగాహన కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో టెంట్, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్రభవన్‌లో ఆదివారం సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన మహాయోధుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్లకే ప్రాణాలను అర్పించిన మహనీయుడన్నారు నేటి యువతరం భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని దేశం కోసం పాటుపడాలని సూచించారు. ఏఐటీయూసీ నాయకులు శేషశయన రావు, జూపాక రాజేశ్, కిరణ్‌బాబు, రవి, రమేశ్, రారాజు, మురహరిరావు, మోహన్, శంకరయ్య, అంజయ్య, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోరాటాలు సాగించాలి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

వాంకిడి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న ప్రజావ్యతిరేక పాలనపై యువత పోరాటాలు సాగించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా సహాయ కార్యదర్శి కోదురుపాక మహేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని హనుమాన్ మందిర్ ప్రాంతంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా సంఘం నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. నాయకులు వర్కోల్ రాకేశ్, వికాస్, రమేశ్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పెరిగిన చెట్లు!

- రోడ్డుపైకి వాలిన చెట్ల కొమ్మలు
- ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించక తిప్పలు
- చెట్లను తొలగించాలని వేడుకోలు



తుంపెల్లి నుంచి ఉల్లిపిట్ట ఎక్స్‌రోడ్డు మధ్యలో రోడుపైకి ప్రమాదకరంగా వాలిన చెట్లు

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని తుంపల్లి నుంచి ఉల్లిపిట్ల ఎక్స్‌రోడ్డు వరకు వెళ్లే రహదారి పెరిగిన చెట్లతో ప్రమాదకరంగా మారింది. దీంతో నిత్యం తిర్యాణి వైపు వెళ్లే వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. రోడ్డు మలుపు వద్ద చెట్లు పెరగడంతో ఎదురుగా వస్తున్న వారు కనిపించక ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు పులుల సంచారంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రోడ్డుపై ప్రయాణిస్తున్నారు. చెట్లు పెరగడంతో పలుమార్లు వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వాహనదారులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రోడ్డుపైకి వస్తున్న చెట్లను తొలగించే చర్యలు చేపట్టాలని సమీప ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

‘ఇందిరమ్మ’కు గౌరవమేది..?



చెత్త కుప్పల మధ్య ఇందిరాగాంధీ విగ్రహం

వాంకిడి: భారతదేశ మొదటి, ఏకైక మహిళా ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహాన్ని చెత్త కుప్పలు, తుమ్మ పొదల్లో ఉంచి అగౌరవ పరుస్తున్నారు. నాలుగేళ్ల క్రితం నాలుగు వరుసల జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఇందిరానగర్‌లో ఉన్న విగ్రహాన్ని తొలగించాల్సి వచ్చింది. రహదారి పనులు పూర్తయ్యి దాదాపు రెండేళ్లు కావస్తున్నా గ్రామ పంచాయతీ అధికారులు విగ్రహం వైపు తిరిగి చూడటం లేదు. నాలుగేళ్లుగా ఎవరూ పట్టించుకోకపోవడంతో విగ్రహం కళావిహీనంగా మారడమే కాకుండా చెత్త, పొదలు విగ్రహం చుట్టూ పేరుకుపోయాయి. ప్రస్తుతం పెట్రోల్ బంక్ ప్రాంతంలోని ఓ మెకానిక్ షాప్ పక్కన చెత్తకుప్పలో ఇందిరాగాంధీ విగ్రహం దర్శనమిస్తోంది.

అనార్‌పల్లిలో వైభవంగా ‘అనఘావ్రతం’



హాజరైన భక్తులు

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి గ్రామంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో కనుల పండువగా అనఘావ్రతం నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన వేణుగోపాల్ శర్మ ద్వారా నిర్వహించిన ఈ వ్రతంలో గణపతి, షోడశోభాచారపూజ, కళశ, దత్తాత్రేయ, వేంకటేశ్వర స్వామి పాద పూజలు నిర్వహించారు. వ్రతంలో వివిధ గ్రామాలకు చెందిన 120 జంటలు పాల్గొన్నాయి. వారు దేవిదేవతలకు మంగళహారతులు ఇచ్చారు. అనంతరం భోగ్ భండార్ పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు రాజు, హిందుధర్మ జాగరణ కార్యకర్త అరుణ్, ఆలయ అర్చకుడు జాదవ్ ధన్‌రాజ్, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులుగా కొనసాగించాలి



కేక్ కట్ చేస్తున్న ఎనగంటి ప్రవీణ్ కుమార్

వాంకిడి: గత ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు కార్యక్రమంలో పని చేసిన సిబ్బందిని కాంట్రాక్ట్ బేసిక్ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎనగంటి ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కేక్ కట్ చేసి వరల్డ్ ఆప్టోమెట్రిస్ట్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులో కంటి వైద్యులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కంటి వెలుగులో పని చేసిన సిబ్బందిని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒప్పంద ఉద్యోగులుగా కొనసాగిస్తే కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

వరల్డ్ ఆప్టోమెట్రిస్ట్ డే వేడుకలు

ఆసిఫాబాద్‌అర్బన్: వరల్డ్ వరల్డ్ ఆప్టోమెట్రిస్ట్ డే వేడుకలు పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలో ఆప్టోమెట్రిస్ట్ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో చిన్నాపెద్దా తేడా లేకుండా కంటి సమస్యలు అధికమవుతున్నాయన్నారు. గత ప్రభుత్వం కంటి వెలుగు స్కీంలో పని చేశామని, జిల్లాలో ఒక్క ఆప్తమాలిక్ అధికారి కూడా లేదని తెలిపారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన పరికరాలు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. ప్రజాధనం వృథా కాకుండా ఉండాలంటే పని చేసిన వారిని తిరిగి కాంట్రాక్ట్ బేసిక్ పద్ధతిలో పీహెచ్‌సీ, సబ్ సెంటర్‌లలో కొనసాగించాలని కోరారు.

గంటల వ్యవధిలో బైక్ అప్పగింత



బైక్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

కౌటాల: గంటల వ్యవధిలోనే దొంగిలించిన బైక్‌ను గుర్తించి పోలీసులు బాధితుడికి అప్పగించిన ఘటన కాగజ్‌నగర్ పట్టణంలో జరిగింది. పట్టణంలోని రవితేజ కిరాణం షాపు వద్ద పార్కింగ్ చేసిన తూడురు రవీందర్‌కు చెందిన ఎక్సెల్ బైక్‌ను ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. బాధితుడు కాగజ్‌నగర్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు వెంటనే పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాలను పరిశీలించి మధ్యాహ్నం 3 గంటలకు పట్టణంలోనే ఎక్సెల్ బైక్‌ను పట్టుకుని బాధితుడికి అప్పగించారు. గంటల వ్యవధిలో బైక్‌ను పట్టుకొని అప్పగించడంతో బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

క్రీడాకారులు సకాలంలో రావాలి

కౌటాల: జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కౌటాల పోలీస్‌స్టేషన్‌లో నేడు నిర్వహించనున్న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు క్రీడాకారులు సకాలంలో రావాలని కౌటాల సీఐ ముత్యం రమేశ్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తారన్నారు. ఆయా జట్ల క్రీడాకారులు సమయానికి కౌటాల పోలీస్‌స్టేషన్ మైదానంలో హాజరు కావాలన్నారు. వాలీబాల్ పోటీలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి వాలీబాల్ క్రీడాకారులు సమయపాలన పాటించి సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా ఇఫ్తార్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జమాత్ ఏ ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జమాత్ ఏ ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముబాశీర్ హాజరై మాట్లాడారు. పవిత్రమైన రంజాన్ నెలలో ముస్లింలు ప్రతీరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసం (రోజా) పాటిస్తారన్నారు. కేవలం తిండి, నీటిని వదిలివేయడం కాదని, మాటలు, పనులు, ఆలోచనలపై నియంత్రణ సాధించడమే అసలు లక్ష్యమన్నారు.

చిరువ్యాపారుల మానవత్వం



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో మతిస్థిమితం కోల్పోయి గడ్డం పెంచుకొని తిరుగుతున్న ఓ వ్యక్తిని స్థానిక చిరువ్యాపారులు అక్కున చేర్చుకొని మానవత్వం చాటుకున్నారు. ఆదివారం వివేకానంద చౌక్ సమీపంలో తిరుగుతున్న వ్యక్తికి చిరువ్యాపారులు కలీం బాబా, జలాల్, ఇర్ఫాన్‌లు క్షవరం చేయించారు. అనంతరం అతనికి స్నానం చేయించి కొత్త దుస్తులు తొడిగారు. - ఆసిఫాబాద్

గ్రంథాలయం.. నిరుపయోగం!



కెరమెరి: మండలంలోని జోడేఘాట్ గ్రామంలో పోలీసులు ఏర్పాటు చేసిన గ్రంథాలయం నిరుపయోగంగా మారింది. గతంలో ఉన్న ఎస్పీ సురేశ్ కుమార్ జోడేఘాట్ మ్యూజియం సందర్శనకు వచ్చే పర్యాటకులతో పాటు గ్రామంలో ఉన్న ఆదివాసీ విద్యార్థులు వివిధ రకాల పరీక్షలకు సిద్ధమయ్యేందుకు గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ప్రారంభంలో కొన్ని పుస్తకాలను గ్రంథాలయంలో ఏర్పాటు చేశారు. తర్వాతి కాలంలో గ్రంథాలయాన్ని తెరవడం మర్చిపోయారు. పోలీసు అధికారులు గ్రంథాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్, సభ్యులు

కెరమెరి: మండలంలోని చిత్తగూడ గ్రామంలో ఆదివారం గోండ్వానా ఫౌండేషన్ క్యాలెండర్‌ను ఆ సంఘం చైర్మన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా ఫౌండేషన్ పేద ప్రజలకు వివిధ రకాల సేవలు అందిస్తుందన్నారు. ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అధికంగా సభ్యులు సంఘంలో చేరాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు కే.జంగు, పీ.లక్ష్మణ్, కోట్నాక శంకర్, దత్తు, మహిళా సభ్యులు దరియాబాయి, గంగాబాయి, భగీరథ, శాంత, లక్ష్మిబాయి, తిరుమల, కవిత ఉన్నారు.